
# మండుతున్న మా ఊరు!

## పులికంటి కృష్ణారెడ్డి

**ఆరు పదుల వయస్సుకు అటో ఇటోగా జరుగుతున్న ఈ జీవితంలో ఈ పట్టణంతో నా అనుబంధం అయిదు పదులకు అటో ఇటోగా. ఆరు పదుల్లో అయిదు పదులు తీసేస్తే మిగిలేది ఒక్క పది. ఆ ఒక్క పదేళ్లు మాత్రమే నేను పుట్టిన ఊరికీ, నాకూ అనుబంధం. అయినా అదే మా ఊరు!**



లేత గుండెల వాకిట్లో మా ఊరు చిత్ర విచిత్రమైన రంగు రంగుల ముగ్గులు పోసింది. మరపురాని జ్ఞాపకాలకు అవి తీపి గుర్తులు!

ఏభై ఏళ్ల అనుబంధంతో ఈ పట్టణం నాకు నేర్పింది ఎన్నెన్నో పాఠాలు. పాఠం నేర్చుకున్నంతసేపే. తర్వాత షరా మామూలే. తెలిసి తెలిసీ పప్పులో కాలెయ్యడం, ఆ తర్వాత 'అయ్యో!' అని తలపట్టుకుని కూర్చోవడం.

ఎంతెంతోమంది చిత్ర విచిత్రమైన మనస్తత్వాలు ... వాళ్లతో పరిచయాలు, స్నేహాలు, కలతలు, కన్నీళ్లు, అపోహలు, అపార్థాలు — వ్యక్తం చేసుకోలేని చిత్రహింసలు! ఒక్కొక్కప్పుడు గుండె ఆగిపోతుందేమో అనిపించేది. అయినా ఆగిపోలేదు. అప్పులు, అరెస్ట్ వారెంట్లు, కోర్టుల చుట్టూ ప్రదక్షిణాలు, ఎదిగొచ్చిన పిల్లలు, పెళ్లిళ్లు, కొంపలో కుమ్ములాటలు — ఈ బాధలు పడడానికంటే ఏ బావో, గుంటో చూసుకోవడం మేలనిపించేది. అదీ చేయలేదు.

అందుకే ఇది జీవితమైంది!

ఈ జీవితం ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తే, నిర్మల జలపూరితమైన నిండు సరస్సువంటిది కాదు. కొండల్లో, కోనల్లో, బండరాళ్ల సందుల్లో చీకి పొదల గుండెల్లో పరిస్థితులను, పరిసరాలను అనుసరించుకుంటూ పొంగుతూ, కుంగుతూ ముందుకు సాగిన ఒడిదుడుకుల పిల్ల కాలువ!

పడిన కష్టాలు, కార్చిన కన్నీళ్లు ... నిజం. మరపు మనిషికి ఒక వరం. లేకపోతే ఒక్క అడుగు ముందుకు సాగేది కాదేమో?

అయినా మా ఊరు మాత్రం మరపు రాదు.

ఎట్లా మరిచిపోయేది?

పుట్టి పెరిగిన మట్టి ఎండకు ఎండి, వానకు తడిసి వెదజల్లిన సువాసనలు, చెరకు గానుగలు ఆడుతున్నప్పుడు పాలు కాగికాగి సాగు పక్వానికి వస్తున్నప్పుడు మాటలకందని కమ్మని వాసనలు, పూసి నునులేత పిందెలేస్తున్న మామిళ్లు వెదజల్లిన సువాసనలు ... ఆకులమాటున కోయిలల కుహూ కుహూ రాగాలు, ముత్యాలమ్మ తిరునాళ్లు, పొంగళ్లు, తీర్థాకుల్లో ప్రసాదాలు, సంక్రాంతి సంబరాలు, కోడి పందాలు ... పశువుల పండుగలు —

రేగుపళ్ల కోసం కాళం గుంటలో, బిక్కిపళ్ల కోసం చిలకల కొండదడిలో చెట్లెక్కుతున్నప్పుడు లేత పాదాల్లో ఎక్కిన ముళ్లు పెట్టిన తీపి బాధలు ... గూటంకొండ కుప్ప మీద, జారుడు బండ్లమీద పంతాలేసుకుని జారిన జారుళ్లు ... వెన్నెల రాత్రుల్లో కోలాటాల కోపులు, ఉప్పర పట్లెలు, చెడుగుళ్లు —

వీటన్నిటినీ తలదన్నేటట్టుగా మా ఊరి గుండె గుండె పొరల్లో ఆత్మీయతానురాగాల దొంతర్లు!

ఇవన్నీ గుర్తుకొస్తే మనస్సుకు పది పన్నెండేళ్ల ప్రాయం వచ్చేస్తుంది. చిన్న నిక్కరు చొక్కా తొడుక్కుని పట్టుకున్నా నిలవకుండా పరుగులు తీస్తుంది. కాంతికంటే వేగంగా మా ఊరు చేరుకుంటుంది. అటువంటి సమయాల్లో నాకు కాళ్లు నిలవవు. ఆ కాళ్లకు చెప్పులు తొడుక్కుంటూ ఉంటే —

"ఆ పల్లె కొంపలో ఏఁవుందాదని?

ఎవరుండారని? పిల్సి పిడికెడు మెతుకులు మొకాన ఇదిలించే ఒక అయినోళ్లా, పోయినోళ్లా? మాటమాటకు మా ఊరు మా ఊరంటాడే ఈ మొగోడు! ఎట్టా ఎగులాడేదబ్బా ఈ మణిసితో? బతుకులో పొద్దు వాలిపోతా ఉండాది. ఎప్పుడు పొయ్ గూట్లో పడ్తిందో, ఏంపాడో ఎవుడికెరిక? కొంపలో నిమ్మతిగా రామా, కృష్ణా అంటూ పడుండకుండా కొంపలు కొళ్లబోతా ఉణ్ణెట్టు ఎలబార్తా ఉండాడే?" అని అంటూ శేష జీవిత బాధ్యతలను గుర్తు చేస్తూ ఉంటుంది సూటిపోటు మాటలతో మా ఇంటామె.

ఆమె అనడం, నేను వినడం, అనుకున్నది అనుకున్నట్లు జరిగిపోవడం సర్వసాధారణమైపోయింది ఈ బతుకులో.

అందుకే నేను బస్సెక్కినాను. బస్సు కదిలింది. కదిలిన కొంచెం సేపటికే బైపాస్ రోడ్డు మీద వేగాన్ని పుంజుకుంది. దూసుకుని ముందుకు పోతోంది.

బస్సులో అంతమంది తోటి ప్రయాణికులున్నా నన్ను ఒంటరితనం ఆవరించింది. అంతే కదా? అవసరం కోసం కల్పించుకున్న ఒక చిన్న లోకం అది. ఆ లోకంలో ఎవడి ఆలోచన వాడిది. ఎవడి తాపత్రయం వాడిది. ఆ కారణంగా ఒకడితో ఒకడికి సంబంధమే లేనట్లుగా కూర్చున్నా, ప్రతి ఒక్కడికీ ఒక మనసు ఉంటుంది. అది అప్పుడప్పుడు చెప్పిన మాట వినకుండా చెల్లెం చేసినా, ఒక్కొక్కప్పుడది బుట్టలో పాములా అణిగిమణిగి మనిషిని కనికరిస్తుంది. అటువంటి సమయాల్లో మనిషి మనసుతోనే మాట్లాడుకుంటాడు. నా పరిస్థితీ అదే. అయితే అనుకోనట్లుగా నా దృష్టి పక్కకు మరలింది. పక్కన ఇద్దరు కుర్రవాళ్లు. ఆ ఇద్దరూ నాలుగు చేతులతో ఒక సినిమా పత్రికను పట్టుకున్నారు. ఆ పత్రిక పుటపుటలో సినిమా తారల బొమ్మలు. ఆ బొమ్మల ఒంటి మీద ఒంపు సొంపులతో వాళ్ల కొంటె చూపులు ఆడుకుంటున్నాయి. 'హుఁ, ఏ పెద్దబాలశిక్షో, సుమతీ శతకమో చేతపట్టుకోవలసిన వయసు. ఈ సినిమాలతో, సినిమా పత్రికలతో, బూతు సాహిత్యంతో ఈ తరం తరంగాని తరమైపోతున్నదే' అన్న ఆలోచన. ఒక నిట్టూర్పు.

అంతలో చెవులు చిల్లులు పడేటట్లు హారన్ మోతతో ఉన్నట్లుండి బస్సు ఒక్క ఊపుతో నిలబడింది. దాని గమనానికేదో అడ్డుపడింది. దానిని తప్పించుకుని బస్సు ముందుకు కదిలింది. నా మనస్సు కూడా అంతే. దాని ఆలోచనలకు అంతరాయం కలిగించిన కుర్రవాళ్లను వాళ్ల దారికి వదిలింది. నా ఇంటికి పరుగు తీసింది. నేను బయలుదేరుతూ ఉంటే మా ఇంటామె అన్న మాటలు చెవులను తొలుస్తున్నాయి.

"బతుకులో పొద్దు వాలిపోతూ ఉండాది. ఎప్పుడు పొయ్ గూట్లో పడిందో, ఏంపాడో ఎవుడికెరిక?"

నిజమే కదా!

ఇక్కడ ఈ పట్టణంలో కూర్చుని పల్లెలో అయ్య చనిపోయిన కబురు విన్నాను. ఆ తర్వాత అన్నెం పున్నెం అనుభవించకుండానే అన్న జీవితం ముగిసిపోతే విన్నాను. అయిదారేండ్లకిందట మాతోనే ఉండి నిండు నూరేళ్ల జీవితం పండించుకున్న అమ్మ గతించడం కళ్లారా చూశాను. ఇంకా ఎందరో హితులూ, సన్నిహితులూ చెప్పకుండా చెందకుండా పోయినారు. ఇదంతా మనసులో మెదిలినప్పుడు కట్టలు తెంచుకునే దుఃఖం. ఆ దుఃఖంలో ఒక రకమైన వైరాగ్యం. తనకేమీ పట్టనట్లుగా నడుస్తున్న కాలం. ఆ కాలం చావు పుట్టుకలు సహజమే కదా అన్న పాఠాన్ని నేర్పడం, ఓదార్చడం! ఇప్పుడు ఎప్పుడెప్పుడు ఎవరెవరు గతించినారో కూడా మతికి రావడంలేదు.

నా ఆలోచనల్లో నేనుంటే, "అయ్యా! అయ్యా! మీ ఊరొచ్చేసింది, దిగండి! ఆ తర్వాత కావాలంటే తీరిగ్గా కూర్చుని ఆలోచించుకోండి!" అన్నట్లుగా నన్ను మా ఊరి గుంటకట్ట మీద దింపి బస్సు తన దారిన తాను వెళ్లిపోయింది.


"ఏంది నీ తలతిక్క? ఏఁవుండాదని నీ కిక్కడ? ఎవుడున్నాడని నీకిక్కడ?" అని ఎదురుగా నిలబడి మా ఇంటామె నిలదీస్తున్నట్లుంది.

నిజమే. నాది తలతిక్కే. అక్కడ నాకు ఏమీ లేదు అంటే ఒప్పుకుంటాను. నువ్వు చెయ్యగలిగింది కూడా ఏమీ లేదు అంటే ఒప్పుకుంటాను. ఎవ్వరూ లేరంటే? ఉన్నాడు కదా వెంకటరెడ్డి. వాడికోసమే బయలుదేరుతూ ఉంటే వాడే ఎదురుపడె. నేను ఎదుటపడ్తే వాడి మొగం వెయ్యి కేండిల్ బల్బు వెలిగినట్లు వెలిగిపోయేది. అటువంటిది వాడి మొహాన కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు. నన్ను చూస్తూనే వాడి తల వాలిపోయింది. వినరాని ఏ మాట వినవలసివస్తుందో అని నా గుండె గబేల్మంది.


అడుగు అడుగ్గా వాడు నడుస్తున్నాడు. వాడి వెంట నేనూ. గమ్యం మాత్రం నాకు తెలుసు. అది ఆ గుంట కట్ట మీద వారధి. చిన్ననాటి నుండి అదే మా కొలువు కూటమి. ఆ వారధి మీద కూర్చున్నాము. వెంకటరెడ్డి వంచిన తలెత్తకుండా ఆలోచిస్తున్నాడు. ఆ మౌనాన్ని భరించలేని నా చూపులు ఎక్కడో చూస్తున్నాయి.

ఎదురుగా కొలిమి చింతమాను. ఆ చింతమానుకింద కొలిమి. ఆ కొలిమి చుట్టుపక్కల పది పన్నెండు గ్రామాలకు వరప్రసాదం. ఆవుల వేళప్పుడు ముట్టించిన కొలిమి ప్రతిరోజూ కన్నీకటి పడేదాకా మండుతూనే ఉండేది. మండిన కొలిమి మండుతూ ఉంటే కర్రలూ, కత్తులూ, కొడవళ్లూ, తూళికలు, ఉళనాయిలువంటి సేద్యపు కొరముట్లు అక్కడ తయారయ్యేవి. వాటి కోసం పడిగాపులు కాస్తూ రైతులు. ఆ చింతమానికింద ఎప్పుడు చూసినా ఒక చిన్నసైజు సంత జరిగినట్లుండేది. ఇప్పుడా కొలిమి పక్కన బూడిద కుప్పలో రెండు కుక్కలు పొర్లాడుతున్నాయి. ఇంకొక కుక్క వెనక కాలిని కొలిమి పైకి లేపింది. ఆ దారిన పోతున్న రెండు మూడు ఊరపందులు వాటిని చూసి గుర్‌గుర్ మంటున్నాయి. పెళ్లలు పెళ్లలుగా ఊడి ఒక చిన్న త్రిభుజాకారంలా నిలబడిన కొలిమి. సామ్రాజ్యాన్ని పోగొట్టుకున్దన రాజుగారి తుప్పు పట్టిన కిరీటాన్ని తలపింపచేస్తూ ఉంది. గతాన్ని తలచుకుని ఆ చెట్టు నిట్టూర్పుల్లా సాగిన కొమ్మలు. ఆ కొమ్మల సందుల్లో తగులుకొని పడమటి కొండల్లో పడబోతున్న సూర్యుడు. ఆ సూర్యుణ్ణి తరిమేసి ఆ రాత్రి తలదాచుకోవడానికి ఆ చెట్టుకు కైవారాలు చేస్తూ.... గొంతులు చించుకుంటూ కాకులు!

"అన్నా! అరవైఏళ్లు నెత్తిమీదికొచ్చినాయి కదా మనకు? ఈ మూడూళ్లల్లోనే కాదు, ఈ పాయకట్లో ఖూనీ జరిగింది నువ్వెప్పుడైనా విన్నావా?"








ఆ వేళప్పుడు ఆ రోజుల్లో ఎన్ని మందల గొర్రెలు? ఎన్ని మందల మేకలు? ఎన్ని మందల ఆవులు మేతకుపోయి తిరిగి వస్తూంటే ఆ గుంటకట్టుమీద గోధూళి సంజ వెలుగుతో పోటీ పడినట్లుండేది. ఏదో ఒక జాతర జరుగుతున్నట్లు కోలాహలంగా ఉండేది. ఇప్పుడా సందడే లేదే? అని ఆలోచిస్తున్నాను నేను ఆ మాటలో ఉలిక్కిపడినాను. ఒక్క క్షణంలో గతంలో నుండి ప్రస్తుతానికి —

"ఏందిరా నువ్వనింది? ఈ ఊళ్లో ఖూనీ ..."

"అవునన్నా అవును. మనూళ్లోనే ఖూనీ. కొంపల అవతారం చూస్తూంటే అర్థమై చావడంలేదా?"

ఎట్లా ఊహించను? తన ఇంట్లో కాదు. ఎవరి ఇంట్లో అయినా సరే. వాడు ఎవడైనా సరే ... కాలం తీరి చచ్చిపోతేనే ఒకరినొకరు కావిలించుకుని కంటికి కడివెడుగా ఏడ్చిన గుండెలు! ఆ గుండెల్లోనే బాకులు దించుకునే స్థాయికి ఎదుగుతాయనీ ...

"ఈ ఖూనీ ఎట్లా జరిగింది? ఎందుకు జరిగింది అని మథనపడుతున్నావ్. అయినా మాట్లాడలేకపోతున్నావ్ గదన్నా!"

అది నా బలహీనతే కావచ్చు. వాడి మొగంలోకి చూడలేకుండా తల వంచుకున్నాను.

"నువ్వు కాదన్నా తల వంచాల్సింది — తెల్లగా గుడ్డ కట్టిన ప్రతి వెధవ ఒక నాయకుడు కావాలన్న తపన తల వంచాల. ఆ తపనకు మనిషి ప్రాణాలనే పణంగా పెట్టే కిరాతకం తలవంచాల. ఓట్లు తండుకోవడం కోసరం వర్గాలను సృష్టించే దుష్ట సంప్రదాయం తల వంచాల."

"పోనీ, ఈ ఖూనీ ఎందుకుజరిగిందో, ఎట్లా జరిగిందో చెప్పరా!"

"ఆనాడు కోళ్లతో పల్నాటి సీమలు ... ఈ నాడు గ్రామసీమలు."

"అంటే కోళ్ల పందాలతో పుట్టిందా పుందు?"

"అట్లా జరిగినా దానికొక అర్థం పర్థం ఉండేదన్నా. అదిగాదే కత. ఎగవింటోళ్ల కోళ్లు దిగవింటోళ్ల పెళ్లోకి పొయ్‌నాయి. ఆ పెళ్లో పూతాపిందె మిందుండే గుమ్మిడిపాదు. దానిమింద పడినాయి. గెలిగి పాడుచేసినాయి. దిగవింటోళ్ల కడుపు రగిలింది. కోళ్లను వాళ్ల పెళ్లోకి రాకుండా చూసుకోమని హెచ్చరించినారు. అయినా ఈ పల్లె కొంపల్లో కోళ్లు. మూసి పెడ్తే గంపలకింద ఉంటాయి. విడిచిపెడ్తే ఊరంతా పెత్తనం చేస్తాయి. పాపం! వాటిని ఎంతసేపని గంపలకిందేసి మూసిపెట్టేదాని కవుతుంది? అవి గూడా ఆడా ఈడా తిరిగి బొక్కడు మేత చూసుకోవాల గదా? సరే! ఒకటికి మూడుసార్లు కోళ్లు గుమ్మిడి పాదులమింద పడ్తే వాళ్లు సహించినారు. నాలుగోసారికి వాళ్ల ఓర్పు నశించింది. అన్నంలో అంత ఎలుకల మందు కలిపినారు. గుమ్మిడిపాదు చుట్టూ చల్లినారు. కోళ్లు ఆ మెతుకుల్ని తిన్నాయి. తింటానే మెడలు వాలేసినాయి. కోళ్లు చచ్చిన కొంపలో మీసాలు మెలేసినారు. ఇంకేముంది? కొంపలో మనిషి మంచి చెడ్డలు ఎక్కడ ఆలోచిస్తాడు? 'మా కోళ్లను చంపేదానికి మీకు చేతయితే మాకేనా. చేతగాకుండా పొయ్యింది?' అంటా వీళ్లు ఏకంగా ఎగవింటోళ్ల కుడితి తొట్లో ఎండ్రినే కలిపినారు. ఆ యింటి జోడు కోడెలు ఆ కుడితి తాగి గిలగిలా కొట్టుకుంటూ చచ్చినాయి."

"హుం! బాగుంది కదరా వరస. ఒకడు కోళ్లను చంపితే ఇంకొకడు కోడెదూడలకే ఎసురు పెట్నాడా?"

"అన్నా! కోడె దూడలన్నావే కానీ, దూడలా అవ్వి? రేసుగుర్రాలెందుకు వాటి ముందర? చూసేదానికి రెండు కండ్లూ చాలవే! అన్నా! వాడు మేపినాడు చూడు ఆ దూడల్ని? కడుపులో పుట్టిన బిడ్డల్ని కూడా అంత ముదిగారంగా చూసిన పాపాన పోలేదు వాడు. మంచంమీద కూర్చుని పచ్చి కసువు మోపు ముందరేసుకోని ఈ చేత్తో ఆ చేత్తో మేపువాటి నోటి కందిస్తా ఉంటే ... కొమ్ములకు తొడిగిన కుప్పుల్లో గజ్జెలు ... మెడపట్టెల్లో చిరుగంటలు కలిసి సన్నగా సడి చేస్తా ఉంటే — ఆ దోవన వచ్చే పొయ్యేవాళ్లు నిలబడి 'ఒరే నీ పాసు గూల! ఎప్పుడన్నా బిడ్డలకంత బువ్వ ఇంత ముదిగారంగా తినిపించినావంట్రా?' అని అడిగేవాళ్లే? ఆ గొడ్లు వాడి కండ్లముందరే గిలగిలా కొట్టుకుంటా చచ్చేకుందికి ... ఎందుకులే వాడి బాధ? తిండి తిప్పలు మానేసి నెత్తిన చేతులు పెట్టుకుని బోరోమని ఏడస్తా కూర్చుండె!"


"అంతేగదా మరి? రైతుకు ఆరోప్రాణం ఎద్దులే కదా? పోనీ, ఊళ్లో మద్దిస్తం ..."

"మద్దిస్తమా? అయ్యో రామ! ఇంకా నువ్వు ఏ కాలంలో ఉండావన్నా! సాకు దొరికితే చాలు, ఒకరి నొకరు సాధించుకోవాలని ఎదురు చూస్తా ఉంటే, ఇంక మద్దిస్తం మాట తలపెట్టే వాడెవుడు?"

"పల్లెల్లో ఈ పరిస్థితి కలగటానికి కారణం ఏమంటావ్‌రా?"

"చెప్తి గదన్నా! తెల్లగుడ్డ కట్టిన ప్రతి వెధవ ఒక నాయకుడు కావాలన్న తపన. ఆ తపన ఊరిని రెండుగా చీల్చేస్తా ఉంది. ఊళ్లో రెండు వర్గాలు. ఒక్కొక్క వర్గానికి ఒక నాయకుడు. వాడి వెంట కొంతమంది. వీడి వెంట కొంతమంది. అంత సందు దొరికితే చాలని ఎదురు చూస్తా కూర్చుంటారు. ఇప్పుడు దొరికె సందు. గొడ్లను పోగొట్టుకొని వాడట్టా నెత్తిన చేతులు పెట్టుకుని ఏడస్తా ఉంటే —

"ఒరే పెట్టుమారి నాయాలా! ఎందుకురా యాడస్తావ్? ఏడ్చినా, మొత్తుకున్నా చచ్చిన గొడ్లు బతికి రాబొయ్యేది లేదు గదా! అయినా నా కొడకలకంత తింపురా? నాలుగు పెట్టలను చంపితే బంగారట్టా కోడెలికే ఎసురు పెట్తారా? ఇప్పుడు నువ్వు గాదురా యాడవాల్సింది, నీ పాణానికి పాణమైన కోడె దూడల్ని చంపినాడే వాడి పెండ్లాం యాడవాల. నువ్వు యాడస్తా ఉణ్ణెట్టు మొగుణ్ణి తల్చుకోని



## రుసరుసలు

"ఏమిటి పిన్నిగారు అంత కోపంగా ఉన్నారు?" శ్యామలమ్మను అడిగింది వరమ్మ

"ఇవాళ ముచ్చటపడి ఆర్టీసీ బస్సు స్టాండ్‌లో వెయింగ్ మిష నెక్కి రూపాయి కాయిన్ వేస్తే... ఒక్కటేసారి ఇద్దరు ఎక్కకూడదు అని వచ్చింది." కోపంగా అంది శ్యామలమ్మ.

ముద్దా రమణమూర్తి,
(అనంతపురం)



తల్చుకోని అది యాడవాల. లెయ్ రా లెయ్! నీ ఎనకాల నే నుండ్లా! పో! పొయ్ వాడి అంతు తేల్చుకో!" అంటా ఎగదోలె వాళ్ల పార్టీ లీడర్. అంతే! కడుపు కాలినవాడు. కత్తి చేతికెత్తుకుండె. పట్టపగలన్నా పదిమంది చూస్తా ఉండగానే వేసేసె."

"ఎంత అన్యాయంరా యిది? చినికి చినికి గాలీ వానా అయినట్టుందే వ్యవహారం. అయినా మనిషి ఎంత గింజులాడినా గీ కొట్టుకున్నా తాను యివ్వలేని ప్రాణాన్ని తీసేదానికి ఎవ్వరిచ్చారీ హక్కును? మనిషి ఈమాత్రం ఎందుకు ఆలోచించలేకపోతున్నాడు?"

"ఆనాటి నుంచి, అన్నా! ఏ క్షణంలో ఏం జరుగుతుందో అని ఈ మూడూళ్లు కూడు ఉడికినట్లు ఉడికిపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే, పోలీసోళ్ల సాధింపులు వేధింపులు యింకొక ఎత్తుగా ఉంది. విచారణలు, సాక్ష్యాలు. సాక్ష్యం చెప్తే ఎట్లనో, చెప్పకపోతే ఎట్లనో అని గుండెలు అరచేతుల్లో పెట్టుకుని బతుకుతున్నాం. పోనీ! యిది ఇంతటితో ఆగిపోతుందంటే ఆగదన్నా. ఎదురు పార్టీ ఒకటుంది గదా? ఆ పార్టీకి ఒక నాయకుడున్నాడు కదా? వాడి నాయకత్వం రుజువు కావాలంటే వాడి మనుషులకు వాడు కత్తులు కట్టాల గదా?"

రైతు చెమటతో కంటికి పచ్చంగా కనిపించిన ఈ నేల మీద నెత్తుటి వాగులా? తాను అంత తిని పదిమందికి అంత పెట్టాలనే మన సంస్కృతీ సంస్కారాలకు అద్దం పట్టే ఈ పల్లెల్లో ఖూనీలా?

బాధతో మాట పెగల్లేదు.

దాదాపు జాము రాత్రి కావస్తూ ఉంది. మా ఊరి గుండెల్లో పేరుకొన్న అజ్ఞానం వంటి చీకటి లోకాన్ని దట్టంగా ఆవరించింది. కొలిమిచింతమాని మీద కాకులు సద్దుమణిగాయి.. బురదగుంటలో కప్పలు ఈ పరిస్థితికి ఆక్రోశిస్తున్నట్లు అరుస్తున్నాయి.

"పరిస్థితి చెయ్యి దాటిపొయ్యింది. ఇంక నువ్వూ, నేనూ ఎంత ఆలోచించినా, ఆవేదన పడినా ప్రయోజనం లేదన్నా! నువ్ లెయ్, పోదాం! ఇప్పటికే వేళ మించిపోతింది. అంత తిని పడుకుందువుగాని."

నిజంగా మా ఊళ్లో అడుగు పెట్టడానికే నాకు మనస్కరించలేదు. ఏదో ఒక బస్సెక్కి కొంప చేరుకోవాలని ఉంది. అయినా వాడి మాట కాదనలేక వాడితో బయలుదేరినాను. ఎవరో ఇద్దరు బద్ధశత్రువులు విధిలేని పరిస్థితుల్లో ఒకరి పక్కనఒకరుగా నడుస్తున్నట్లుంది మా పరిస్థితి.

ఊళ్లో అడుగు పెట్టినాము.

అద్ది నలభై ఏండ్ల కిందట నేను చూచిన పల్లె కాదు. వీథిలో పురుగు మెదలడంలేదు. మూసిన తలుపులు మూసినట్లే ఉంటే ఊరు భిసురోమని ఉంది. ఊళ్లో కాదు, ఏదో ఒక



## ఉగాది కోసం

జైలర్: ఈ సెల్‌లో నీతోపాటు ఇంకొక ఖైదీ ఉండాలి కదా. ఎక్కడి కెల్లాడు?

ఖైదీ: ఉగాది పండుగ ఉంది కదా సార్. వాడి పెళ్లానికి నాలుగు పట్టుచీర లిచ్చి వస్తానని చెప్పి కన్నం వేసుకుని వెళ్లాడు.

జైలర్: !!!!

ముద్దా రమణమూర్తి,
(అనంతపురం)

స్మశాన వాటికలో అడుగుపెట్టిన అనుభూతి. నా చిన్నతనంలో ఆవేళప్పుడు వీథుల్లో నడుస్తూ ఉంటే ఎందరి పలకరింపులు? ఎన్నెన్ని ఎగతాళి మాటలు? ఒక వీథిలో ఉప్పరపట్టె, ఒక వీథిలో చెడుగుడు, ఇంకొక వీథిలో కోలాటం, భజన గుడిలో భజన కీర్తనలు — ఈ కోలాహలమంతా ఇప్పుడేమయింది? ఎక్కడికి వలసపోయింది?

మనసు బరువెక్కింది. పట్టు బలవంతంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నడి ఊళ్లో నడుస్తున్నాము. అక్కడొక రాగిమాను. రాగి మానికింద రచ్చబండ. అక్కడ ఎప్పుడూ పదిమంది. వాళ్లతో సందడి. ఇప్పుడు ఒక్కడు లేడు. ఎప్పుడో ఎవడో వంగి నాటిన మొక్క ఎవడైనా తల పైకెత్తి చూడవలసినంత మహావృక్షమైంది. నేనూ తల పైకెత్తి చూసినాను. ఆకుల గలగలలు, పక్షుల కిలకిలలు ఏమైపోయినాయో? మోడై నిలబడి ఉంది ఆ పల్లె పరిస్థితికి ప్రతీకగా!

రచ్చబండకు వెంకటరెడ్డి ఇంటికి ఎంచినట్లు ఏడేడు పధ్నాలుగుగా అడుగులు. ఆ చెట్టు గతి, ఊరి పరిస్థితి మెదడును తొలుస్తూ ఉంటే మైళ్లు నడిచినట్లనిపిస్తూ ఉంది.

వెంకటరెడ్డి ఇంటిముందు నిలబడినాము.

"అమ్మా! కాళ్లూ, చేతులు కడుక్కోవడానికి చెంబుడు నీళ్లు తేమ్మా!" వెంకటరెడ్డి అడిగినాడు.

"అబ్బబ్బ! మీ కూ్కడా అంత తొందరైతే ఎట్ల మామా? కొంచెం ఓపిక పట్టండి. ఇక్కడ ఈయనగారేమో నోటిమింద కాయ పడకుండా ఒంటికాలిమింద నిలబడి ఊరూ నాడూ ఒకటి చేస్తా ఉండాడు."


వెంకటరెడ్డి ముఖం రంగులు మారింది. మారు మాట్లాడలేదు. అడుగు మీద అడుగ్గా పెరట్లోకి నడిచినాడు. కాళ్లూ, చేతులూ కడుక్కున్నాడు. ఒక పెద్ద గుండు చెంబు నీళ్లు నా కోసం తెచ్చినాడు. ఆ చెంబు అందుకున్నాను. ఆ వీథి వాకిట్లోనే కాళ్లు చేతులు కడుక్కున్నాను. చెంబును ఇంటి ముందర తిన్నె మీద పెట్టినాను. నేను ముందు, వెంకటరెడ్డి వెనుకగా ఇంట్లోకి నడిచాము.

ఆ దృశ్యాన్ని చూస్తుంటే నాకు కంటి మీద రెప్ప పడలేదు!

వాడి కొడుకు. కోడి కత్తుల్లాంటి మీసాల్ని మెలేస్తూ అక్కడ జరుగుతున్న కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాడు. వాడి ఈడు వాళ్లే ముగ్గురు. వాళ్ల చేతుల్లో నాటు బాంబులు. మరొక ఇద్దరు తుపాకులు చేత పట్టుకుని దేనికైనా రెడీ అన్నట్లుగా. సన్నని చీరాల మొలగొలుకులతో వండిన అన్నం — మల్లెపువ్వుల్ని మరిపిస్తూ ఉంది. వెంకటరెడ్డి భార్య ఆ అన్నాన్ని రెండు స్టీల్ బకెట్లకు నింపుతూ ఉంది. వాడి కోడలు. ఆమె హడావిడి చెప్పడానికి వీలు లేదు. రకరకాలుగా వండిన మాంసాన్ని రెండు కేరియర్లకు లోడ్ చేస్తూ ఉంది.

"ఈ యేర్పాట్లన్నీ ఎవరికి? ఎందుకీ తొందర? పోనీ, ఏ మంత్రిగారో మకాం

రుమాళ్లూ బనీన్లూ పాంటుజేబుల్లో కుక్కేసినా సరే
ఆటే ఉతుక్కే వేరే వేరే పద్దు రాయాల్సొంచెనంటం-





వేసినాడనుకోవడానికి కూడా ఆ మారు మూల పల్లెలో ఆస్కారం లేదే? అది అట్లా పోనీ, ఈ నాటు బాంబులు ... తుపాకులు ..."

అయోమయంగా వెంకటరెడ్డి మొగంలోకి చూస్తున్నాను.

"అయనకల్లా ఏం చూస్తావులే పెద్దయ్యా! నన్నడుగు, నే చెప్తాను."

వెంకటరెడ్డి కొడుకు నా సందేహాన్ని గ్రహించినట్లుంది. అందుకే చాలా తెంపుగా అన్నాడు. వాడివైపు చూసినాను. మంచి కోపు మీద ఉన్నాడు.

"వాడుండాల, నా కొడుకు ... మూలింటి మునసామిరెడ్డి. మా పార్టీ లీడర్ తలకాయి లేపించేస్తే అప్పటికి మేమేనా కోకలు కట్టుకోని తిరగతా ఉండేది. వచ్చే ఈ దినంలోపల ఆ నా కొడుకు తలకాయి కండ్ల చూడకపోతే ..."

వాడి కండ్లల్లో నిప్పులు కురుస్తున్నాయి.

"మనిషి తల అంటే ఏమనుకున్నావురా?"

"ఇంతకాలంగా మేకపోతులు, పొట్టేళ్ల గొంతులు, కోళ్ల గొంతులు అవులీలగా కోసిపారేస్తా ఉంటిమి. అదే మాకు తెల్సింది కూడా. ఇప్పుడు కత అర్థం తిరిగిపాయె. వాళ్లకు చేతయిన పని మాకు చేతగాకుండా పోతుందా?"

నా ప్రమేయం కానీ, నా మాటతో అవసరం కానీ లేనట్లుగా వాడు మూడు పెద్ద సీసాల విస్కీ సంచిలో సర్దుకున్నాడు. ఇద్దరు కేరియర్‌లు తీసుకుంటే ఇద్దరు అన్నం నింపిన స్టీల్ బకెట్లు అందుకున్నారు. ఎక్కడో పుట్టి మునిగిపోతున్నట్లుగా పరుగుల మీద బయలుదేరినారు.

నిలువు రాయిలా నిలబడి వాళ్ల వైపే చూస్తున్నాను.

"ఏం చూస్తారులే, మామా! చూసి ఏం ప్రయోజనం? ఈ పరిస్థితిలో వాళ్లను దేవుడు కూడా ఆపలేడు. పోనీయండి! ఏది ఎట్లా జరగాలో జరిగి తీరుతుంది. దానికి బాధపడి ప్రయోజనం? ఇంతకూ మీ రెప్పుడు రావడం?"

వెంకటరెడ్డి కోడలు ఆ ఊళ్లోనే ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తూ ఉంది. ఆమె అడిగింది కాదు అనింది నన్ను ఆలోచనలో పడవేసింది.

ఆ అమ్మాయి పాతికేండ్లకు అటో, ఇటోగా ఉంటుంది వయస్సు. ఆ అమ్మాయి అనిన మాట? ఆ పల్లెల్లో ఖూనీ జరగడం నా అరవై యేండ్ల జీవితంలో నేనెరగను. వింటూ ఉంటే నాకే ఒళ్లు వదురుతూ ఉంది. అయితే ఆ అమ్మాయికి చీమ కుట్టినట్లనిపించలేదు. అదేదో ఒక సర్వ సామాన్యమైన విషయంగా ఎట్లా జరగాలని ఉంటే అట్లానే జరిగి తీరుతుందని ఆ వయస్సుకే వేదాంతమా? ఈ తరానికి ప్రాతినిధ్యమా? నా ఆలోచనల్లో నేనుంటే ఆ అమ్మాయి రెండు పీటలు వేసింది. పీటల ముందు విస్తరాకులు పరచింది.

"కూర్చోండి, మామా! భోం చేద్దురుగాని."

మారు మాట్లాడకుండా కూర్చున్నాము. ఆ అమ్మాయి అన్నం వడ్డించింది రకరకాల మాంసాహారాలతో సహా.

ముద్ద మింగుడు పడితే ఒట్టు! మంచికి మానవతకు, నీతికి నిజాయితికీ, అమాయకతకు అనవాళ్లనిపించుకున్న పల్లెలేనా ఇవి? అన్న ఆలోచనే మింగుడు పడకుండా ఉంటే ముద్ద ఎట్లా మింగుడు పడుతుంది?

వెలిగక్కలేని బాధ ముందు మింగుడు పడని ముద్ద!

సందేహానికి తావు ఇవ్వడానికి ఇష్టం లేనట్లుగా తినడం అయిందనిపించేకుందికి తల ప్రాణం తోకకొచ్చింది. అప్పటికే ఆ అమ్మాయి ఇంటి వెనుక ఆరుబయట రెండు నులక మంచాలు వేసి పడకలు సిద్ధం చేసింది. వీధి వాకిట్లో వేయవలసిన పడకలు ఇంటి వెనకకు చేరడం నా ఆలోచనలకు మరికొంత ప్రేరణ ఇచ్చినట్లయింది. పోయి, పడుకున్నాం. ప్రయాణపు బడలిక. ఆలోచనలతో అలసిన మనుసు. పడుకుంటానే నిద్ర పట్టింది.

ఆ నిద్రలో కల —

తుపాకీ చేతపట్టి వెంకటరెడ్డి కొడుకు ఢాం ఢాం అని పేలుస్తున్నాడు. ఇద్దరు చేతి బాంబులు విసురుతున్నారు. ఎవరో ముగ్గురు నేల కొరుగుతున్నారు. ఎదురు కాల్పులు, గాయాలు, రక్తపాతాలు, హాహాకారాలు, ఊళ్లో జనం దొరికిన దారి పట్టి పారిపోవడాలు, పోలీసులు, సాధింపులు, వేధింపులు ... వెంకటరెడ్డి కొడుకు చేతికి బేడీలు ... ఆ ఇంట్లో ఏడుపులు ...

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

చుక్క నడిమిట్టకొచ్చింది.

ఎక్కడో రెండు కుక్కలు ఏడుస్తున్నాయి.

వెంకటరెడ్డి అన్నిటికి అతీతుడుగా నిద్రపోతున్నాడు.

కన్ను పొడుచుకున్నా నిద్ర పట్టడంలేదు.

ఒకే ఒక్క ఏభై ఏండ్ల కాలంలో ఎంత మార్పు?

అది మా అయ్య కాలం. ఇది నా కాలం.

మా అయ్యది మోట్ల కాలం! నాది ఓట్ల కాలం!!

మోట్ల కాలంలో మా అయ్య రైతు. ఓట్ల కాలంలో నేను రచయితను!

రైతుగా మా అయ్య పాతాళ గంగను పైకి తెచ్చినాడు. పదిమందికీ అంత బువ్వ పెట్టే ప్రయత్నంలో పంటలు పండించినాడు. ఆ పంటకు చీడా పీడా పడ్తే విరుగుడుగా మందు కొట్టించినాడు.

ఈ ఓట్ల కాలంలో గుండె గుండెకు పట్టిందే చీడ పీడ! ఈ పీడతో ఊళ్లకు ఊళ్లే మండుతున్నాయే? విరుగుడు మందు ఎక్కడుంది? ఏం చెయ్యాల?

మోట్ల కాలాన్ని స్వాగతించలేను. ఈ ఓట్ల కాలాన్ని భరించలేను!

ఈ సందిగ్ధావస్థలో పడి కుళ్లుతూ కుములుతూ ఎన్నాళ్లు? ఎన్నేళ్లు?

"తెల్లగా గుడ్డ కట్టిన ప్రతి వెధవా ఒక నాయకుడు కావాలన్న తపన తల వంచాల. ఆ తపనతో మనిషి ప్రాణాలనే పణంగా పెట్టే కిరాతకం తల వంచాల. ఓట్లు తండుకోవడం కోసరం వర్గాలను సృష్టించే దుష్ట సంప్రదాయం తల వంచాల!"

వెంకటరెడ్డి అన్న మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

అయితే మాటలకు, మంత్రాలకు చింతకాయలు రాలవని నాకు తెలుసు.

అప్పుడప్పుడే తూర్పు రేకలు మైల విరుస్తున్నాయి!! ★

